RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 257

శుక్రవారం
సెప్టెంబర్ 12, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులు ఆందోళన

2లో..

- ఇతర వర్సిటీలకు భిన్నంగా నియామకాలు!
- పేపర్ వైజ్ టీచింగ్ అరేంజ్‌మెంట్ వైపే మొగ్గు!
- పార్ట్ టైం అధ్యాపకుల రిక్రుట్‌మెంట్‌కు మోక్షమెప్పుడో?
- కొత్త పార్ట్ టైం నోటిఫికేషన్ కోసం నెట్, సెట్, జెఆర్ఎఫ్ పీహెచ్‌డీ అభ్యర్థుల ఎదురుచూపులు
- నోటిఫికేషన్ రిలీజ్ చేయాలని డిమాండ్




# 'కాకతీయ' తీరే వేరు!?

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**


రాష్ట్రంలో రెండో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా కీర్తి ప్రతిష్టను సంపాదించుకున్న కాకతీయ వర్సిటీ ఏర్పడి 50 ఏండ్లయింది. ఎంతో ఘన కీర్తి కలిగిన వర్సిటీ అధ్యాపకుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నది. 400ల పైచిలుకు ఉండాల్సి న రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు.. 77 రెగ్యులర్ అధ్యా పకులతో ముందుకు సాగుతున్నట్టు తెలుస్తున్నది. మిగతా వాళ్లంతా కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకులే. రాష్ట్రంలోని పలు వర్సిటీలు పార్ట్ టైం అధ్యాపకుల నియామకం కోసం నోటిఫికేషన్లు జారీ చేసి నియామకాలు సైతం చేపడుతుంటే.. వాటికి భిన్నంగా కాకతీయ వర్సిటీ వినూత్నంగా ఎక్కడా లేని విధంగా పేపర్ వైజ్, యూనిట్ వైజ్‌గా, గెస్ట్ ఫ్యాకల్టీ పేరుతో నియమించుకుంటున్నది. ఒక పక్కన 2025 –2026 విద్యా సంవత్సరం కూడా ప్రారంభమైనా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారు. కేయూలో పార్ట్ టైం పద్ధతిలోనైనా అధ్యాపకుల నియామకాలు చేపట్టక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని కొందరు విద్యార్థులు పేర్కొంటున్నారు. పీహెచ్‌డీ, పీడీఎఫ్‌లు పూర్తిచేసి నెట్, సెట్ అన్ని అర్హతలు కలిగిన ఔత్సాహికులు పార్ట్ టైం అధ్యాపకుల నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు.


**- సర్కారు అనుమతి కోసం వెయిటింగ్**

గత మూడేళ్ల నుంచి రాష్ట్రంలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాలు పార్ట్ టైం లెక్చరర్ నోటిఫికేషన్లను విడుదల చేశాయి. ఉస్మానియా, తెలంగాణ, పాలమూరు, శాతవాహన, జేఎన్‌టీయూ, నిజాం కాలేజ్, మహిళా విశ్వవిద్యాలయం సహా పలు విభాగాల్లో పార్ట్ టైం అధ్యాపకులను నియమి ంచారు. కానీ, కేయూ అధికారులు మాత్రం పేపర్‌కు రూ.20 వేల వేతనంతో కూడిన అధ్యాపకులను తీసుకు న్నారు. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాలు ఒక విధమైన విధానాలు అనుసరిస్తుంటే.. కాకతీయ యూనివర్సిటీ అధికారులు మాత్రం పేపర్ వైజ్ విధానంలో బోధనకు శ్రీకారం చుట్టారు. గవర్నమెంట్ నుండి పర్మిషన్ కోసం 130 పార్ట్ టైం అధ్యాపకుల పోస్టులకు అప్లయ్ చేసుకుని అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. కానీ, ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే ప్రారంభమమైంది. త్వరలోనే పీజీ మొదటి సంవత్సర విద్యా ర్థులు కూడా యూనివర్సిటీలకు వస్తారు. ఇప్పటికే సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కూడా డిగ్రీ విద్యార్థులకు బోధించడానికి అధ్యాపకుల అవసరం ఉన్నది. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులు వచ్చేలోపే కొత్త పార్ట్ టైం అధ్యాపకుల నియమకాలకు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని నెట్, సెట్, జేఆర్ఎఫ్ పీహెచ్‌డీ, పీడీఎఫ్‌లు పూర్తి చేసిన అభ్యర్థులు కోరుతున్నారు.


**- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో కేయూ స్థానమెక్కడ?**

పేపర్ వైజ్ బోధనా విధానం వల్ల విద్యార్థుల్లో సీరియస్‌నెస్ రాదని, పార్ట్ టైం అధ్యాపకులను నియమిస్తే వారు ఎల్లప్పుడూ విద్యార్థులకు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్ట్ టైం అధ్యాపకులు రిక్రూట్ కావడం వల్ల సీనియర్ ఆధ్యాపకులు రీసెర్చ్ మీద ఫోకస్ చేయొచ్చని, కొవిడ్ తర్వాత వర్సిటీలో పరిశోధన ప్రమాణాలు తగ్గాయని పేర్కొంటున్నారు. ఇటీవల పేర్కొన్న ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకి ంగ్‌లో కాకతీయ యూనివర్సిటీ ర్యాంక్ మరింత తగ్గిపోవడం కూడా ఆందోళన కలిగిస్తున్నదని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు గ్రహించి వెంటనే పార్ట్ టైం నియమాక నోటిఫికేషన్ విడుదల చేయాలని అభిప్రాయప డుతున్నారు. రాష్ట్రంలో ఒక్క కాకతీయ యూనివర్సిటీకి తప్ప ఏ వర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేదని, అయినా ప్రభుత్వ అనుమతి కోసం ఇన్ని రోజులు ఎదురు చూడడం, ఒకపక్క అన్ని విశ్వవి ద్యాలయాలు పార్ట్ టైం అధ్యాపకుల నియామకాలు జరుపుతుంటే కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఆలస్యం చేయడం సరికాదని పలువురు ఆశావహులు అభిప్రాయపడుతున్నారు.




- పోలీసులపై బాధితురాలి ఆరోపణ
- హత్య కేసు నిందితుడితో ప్రాణహాని.. రక్షణ ఇవ్వాలని దళిత మహిళ వేడుకోలు
- ఖాకీలు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.. ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి



# విచారణ లేకుండానే కేసు క్లోజ్!?

**వేద న్యూస్, హన్మకొండ:**

"దళిత ము... అంటే తప్పేముంది.. మీకు మీకు లొల్లిలు ఉంటే బయటకు వెళ్లి చూసుకోండి..అంతే కానీ స్టేషన్‌లో నాటకాలు చేయద్దు.." అని ఎస్ఐ తనతో మాట్లాడారని బాధితురాలు ఆరోపిస్తున్నారు. తనకు ఓ వ్యక్తితో ప్రాణ భయం ఉందని, దయచేసిన తనను, తన పిల్లలను కాపాడాలని ఓ దళిత మహిళ హన్మకొండ పీఎస్ మెట్లు ఎక్కారు. కాగా, అక్కడ పోలీసులు గౌరవ మర్యాదలు లేకుండా తన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని సదరు మహిళ పేర్కొంటున్నారు.

బాధితురాలు ప్రియాంక తెలిపిన వివరాల ప్రకారం.. పీసరి మహేష్ అనే వ్యక్తి ఓ హత్య కేసులో నిందితుడు., అతను బెయిల్‌పై బయటకు వచ్చాడు.ఈ నెల 3న రాత్రి సుమారు 8.35 గంటల ప్రాంతంలో కుమార్‌పల్లిలో.. తాను తన పిల్లలతో ఇంట్లో నిద్రిస్తుండగా, ఇంటి సమీపానికి వచ్చాడు. తన భర్త ఇంట్లో లేని ఆ సమయంలో అందరినీ చంపుతానంటూ బెదిరిస్తూ.. పరుషపదజాలంతో దూషించారు. ఈ విషయమై తాము పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణ లేకుండానే కంప్లయింట్ క్లోజ్ చేశారని బాధితురాలు వాపోయారు. ఎంక్వయిరీ లేకుండా కేసును ఎలా క్లోజ్ చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకొని తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని బాధితురాలు వేడుకుంటున్నారు.

**- బాధితురాలికి వచ్చిన మెసేజ్‌లు ఇవీ!**

హన్మకొండ పోలీసులను బాధితులు ఆశ్రయించగా, ఐడీ డబ్ల్యూఆర్ఎల్‌యూ/హెచ్‌ఎన్‌కేబిడబ్ల్యూజీఎల్‌యూ/టీఎన్ పోలీస్ క్రియేట్ అయింది. ప్రాథమిక విచారణ చేపట్టకుండానే, ఘటనా స్థలాన్ని పరిశీలించకుండానే బుధవారం సాయంత్రం 6:17 గంటలకు 'ద ఎంక్వయిరీ రిపోర్ట్ ఆఫ్ డబ్ల్యూఆర్ ఎల్‌యూ/హెచ్‌ఎన్‌కేబిడబ్ల్యూజీఎల్‌యూ/ 040925/01909 హ్యాస్ బీన్ సబ్మిటెడ్ సక్సెస్‌ఫుల్లీ బై ఈవో కోట సతీశ్ టీఎస్ పోలీస్' అని మెసేజ్ వచ్చింది. అనంతరం 'డియర్ పీసరి ప్రియాంక.., యువర్ కంప్లయింట్– క్రైమ్ పిటిషన్ హ్యాస్ బీన్ డిస్పోజ్‌డ్– ట్రాన్స్‌ఫర్డ్/ ఫార్వర్డెడ్ టీఎస్ పోలీస్' అని మరో మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు కంగుతిని భయాందోళనకు గురయ్యారు. కేసు విచారణ లేకుండా క్లోజ్ చేయడం ఎలా జరుగుతుందని, ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటుంది.

# హలో బీసీ... చలో కామారెడ్డి



- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కృషిని తెలిపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్రంలోని బీసీలంతా సెప్టెంబర్ 15వ తేదీన కామారెడ్డికి లక్షలాదిగా తరలిరావాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపు నిచ్చారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించామని, అనంతరం బీసీలకు న్యాయం చేసేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. గురువారం మంత్రుల నివాస సముదాయంలోని రాష్ట్ర రెవెన్యూ, ఐ అండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో ఈ నెల 15 తేదీన కామారెడ్డి లో నిర్వహి ంచే బహిరంగ సభ ఏర్పాట్లపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి,

మిగతా 2వ పేజీలో..

# ఊపిరి పీల్చుకున్న రైతన్న

**వేద న్యూస్,మరిపెడ :**




మహబూబాబాద్ జిల్లాలో మరిపెడ నరసింహులపేట దంతాలపల్లి డోర్నకల్ ఎరువుల పంపిణీ ప్రక్రియలో పోలీసుల కీలక సహకారం లభించింది. రైతులు ఊపిరి పీల్చుకునేలా, యూరియా బస్తాలను సమర్థవంతంగా మరియు భద్రంగా పంపిణీ చేయడానికి జిల్లా పోలీసులు ముందడుగు వేశారు. జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్, పర్యవేక్షణలో, వివిధ రైతు సమితులు మరియు సభ్యులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పారదర్శకంగా యూరియా ఎరువులు అందజేయబడ్డాయి. ఈ సందర్భంగా రైతులు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ, పోలీసుల సహకారం వల్ల తాము నిశ్చింతగా ఎరువులు అందుకున్నామని తెలిపారు. మహబూబాబాద్ పోలీసు విభాగం, రైతులకు మంచినీళ్లు ఇవ్వడం సమస్యలను అర్థం చేసుకుని సమయానుకూల చర్యలు తీసుకోవడం పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు హామీ ఇచ్చారు.

# క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ అధ్యక్షతన గురువారం నాడు జరిగిన ఇంటర్ కాలేజియేట్ కబడ్డీ టోర్నమెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం విచ్చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తూ విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో టాస్ వేసి కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ, పి.జి. విద్యార్థులకు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ ప్రతిభతో వర్సిటీకి పేరు ప్రతిష్టలు పెంచేవిధంగా విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో తమ జీవన విధానాన్ని కొనసాగించాలని, జీవితంలో అనేక ఇబ్బందులు కష్టాలు తప్పవు కాబట్టి ప్రతి విషయానికి సున్నితంగా ఉండకుండా గెలుపోటములను సమాన పద్ధతిలో స్వీకరించడం అలవర్చుకోని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని, క్రీడల్లో గెలుపోటములు కొలమానం కాదని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం క్రీడాకారులకు తెలిపారు. ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ మొత్తం 22 టీంలు పాల్గొంటున్నాయని గురువారం క్వార్టర్ ఫైనల్స్, శుక్రవారం నాడు సెమి ఫైనల్స్, ఫైనల్స్, పూర్తవుతాయని ఆతరువాత బహుమతుల ప్రధానం ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయ వ్యాయమ కళాశాల నేతృత్వంలో ఈకబడ్డీ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై.వెంకయ్య, డాక్టర్ సోమన్న, డాక్టర్ బి. కుమారస్వామి, ఎస్. కిరణ్ కుమార్, సుమన్, కిషన్, బుచ్చయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

# అభినందనలు తెలిపిన కేయూ ఉద్యోగులు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలెట్ అథారిటీ మెంబర్ గా నియమితులైన కేయూ విశ్రాంత ఆచార్యులు గాదె దయాకర్ నియామకమైన సందర్భంగా కేయు నాన్ టీచింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సభ్యులు గురువారం ఉదయం ఆయనను వారిగృహంలో కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరాగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఆచార్య దయాకర్ ను కలిసిన వారిలో డా. ఏ.నాగేశ్వర్ రావు, వి.కృష్ణమాచార్య, టి.మల్లయ్య, ఏ.నర్సింహమూర్తి, ప్రభాకర్, జి. చంద్రిమౌళి, ఎం. ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన అధ్యక్షుని గా మహేష్ ఎన్నిక

**వేద న్యూస్, చొప్పదండి :**



మండలం లోని అర్నకొండ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం వారు ఎన్నికలు గురువారం రోజున నిర్వహించారు. సంఘం అధ్యక్షుని గా మోదుంపల్లి మహేష్(చక్రి) విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా వడ్లూరి అజయ్, ప్రధాన కార్యదర్శిగా చిలుముల మహేష్, సంయుక్త కార్యదర్శిగా చాతర్ల ప్రవీణ్, సాంస్కృతిక కార్యదర్శిగా మోదుంపల్లి ఉదయ్, ప్రచార కార్యదర్శిగా శివయ్య, కార్యవర్గ సభ్యులుగా పలువురి సభ్యులు ఎన్నికయ్యారు.

# ఎన్ సిసి క్యాడెట్స్ ఎంపిక

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ సిసి క్యాడేట్స్ ఎంపిక ప్రక్రియ గురువారం నిర్వహించారు. కళాశాలలో నూతనంగా ప్రారంభమైన ఎన్.సి.సి. యూనిట్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిలకు ఎన్.సి.సి. 8వ గర్ల్స్ బటాలియాన్ సీనియర్ జె.సి.ఓ సుబేదార్ కే.రమణ రావు పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 100 కు పైగా విద్యార్థినిల కు వివిధ టెస్ట్ లు నిర్వహించారు. అందులో నుండి 35 మంది విద్యార్థినిలను ఎంపిక చేయడం జరిగింది. 15 మంది విద్యార్థినిలను రిజర్వ్ లో ఉంచడం జరిగింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. భిక్షాలు మాట్లాడుతూ విద్యార్థినిలు అన్ని రంగాల్లో రాణించాలని ముఖ్యంగా ఎన్.సి.సి. లో ఉండడం వల్ల క్రమశిక్షణ, ఏకాగ్రత, దేశం పట్ల భక్తి, మానసిక ఉల్లాసం మొదలైన లక్షణాలు పెంపొందించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.సి.సి యూనిట్ కేర్ టేకర్ వై.యశస్విని, కళాశాల అధ్యాపకులు, సూపరింటెండెంట్ వీరు నాయక్ బానోత్ పాల్గొన్నారు.

# హలో బీసీ... చలో కామారెడ్డి

సీఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, శాసనసభ్యులు మదన్ మోహన్ రావు తదితరులతో మంత్రి సురేఖ సమావేశం అయ్యారు. కామారెడ్డి సభను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్టు చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అందుకే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసిల కోసం కృషి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని సమావేశంలో మంత్రులంతా సమిష్టిగా అభిప్రాయపడ్డారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సాధించామని వివరించారు. ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్టాత్మకమైందని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవలంభించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించినట్టు వివరించారు.

# చేతకాకపోతే కేంద్రానికి లేఖ రాయండి

**వేద న్యూస్, మెట్ పల్లి :**




జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్ ల సమక్షంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి బాబు మాట్లాడుతూ ఇది పూర్తిగా స్థానిక ఎన్నికల స్టంట్ గా బిజెపి పార్టీ శ్రేణులు కొట్టిపారేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతులు లేనే లేరని కొన్ని పార్టీల నాయకులు రైతు కండువాలో దర్శనమిచ్చారని యాదగిరి బాబు అన్నారు. పార్లమెంట్ సభ్యులు కాదు అరవింద్ ఆదేశాలతో మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి మల్లాపూర్ నుండి షుగర్ ఫ్యాక్టరీ వరకు ఫ్యాక్టరీ తెరిపించాలని పాదయాత్ర నిర్వహించినట్లు అన్నారు.షుగర్ ఫ్యాక్టరీ విషయంలో ఏనాడు కమ్యూనిస్టు పార్టీలు మాట్లాడలేదని,నేడు మాట్లాడటం ఏమిటి అని ఇది పూర్తిగా ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఎద్దేవా చేశారు.భారతీయ జనతా పార్టీ షుగర్ ఫ్యాక్టరీ విషయంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టామని, ధర్మపురి అరవింద్ చెరుకు ఫ్యాక్టరీ నుండి బోధన్ చెరుకు ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేశాడని గుర్తు చేశారు. మీకు ఫ్యాక్టరీ తెరిపించడం చేతకాకపోతే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయమని రాష్ట్ర ప్రభుత్వానికి తెలుపుతున్నామన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ కేంద్ర ప్రభుత్వాంతో మాట్లాడి చెరుకు ఫ్యాక్టరీ తెరిపిస్తాడని అరవింద్ పక్షాన బిజెపి నాయకులు ప్రజలకు హామీ ఇస్తున్నట్టు తెలిపారు.

# సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులు ఆందోళన

**వేద న్యూస్,కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో ఉన్నటువంటి 270 యూరియా బస్తాలు వచ్చి వారం రోజులుగా నిల్వ ఉన్న అధికారులు సొసైటీ ప్రతినిధులు రైతులకు యూరియా అందించక సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యం వీడటం లేదన్నారు. గోధంలోకి వచ్చిన యూరియా బస్తాలు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పూర్తి స్థాయి మండిపడ్డారు. రైతులకు వెంటనే సరఫరా చేయాలని, లేకుంటే సొసైటీ తాళాలు పగలగొట్టి నేరుగా రైతులకు సరఫరా చేస్తామని హెచ్చరించారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు సరిపడ యూరియా దొరకగా దిగుబడి తగ్గే ప్రభావం ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని, తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి చేయడంలో పోరాటం చేయడంలో నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తున్నామన్నారు. వెంటనే రైతులకు సరపడు యూరియా అందించాలి. లేనియెడల గ్రామస్థాయి నుండి రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఏకం చేసి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాసం సురేష్, రైతులు అనుముల లచ్చయ్య, వీరయ్య, భద్రయ్య, రాములు, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించినందుకు రాస్తారోకో

**వేద న్యూస్, కరీంనగర్:**




కరీంనగర్ నగరంలోని కిసాన్ నగర్ లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని

అర్ధరాత్రి పూట దొంగతనంగా అవమానకరమైన పద్ధతిలో తొలగించడాన్ని నిరసిస్తూ కిసాన్ నగర్ డివిజన్ ప్రజలు, దళిత సంఘాలతో కలిసి విగ్రహం తొలగించిన చోట నుండి నిరసన ర్యాలీ గాంధీ చౌక్ వద్దకు చేరుకొని రాస్తారోకో చేపట్టి ధర్నా నిర్వహించారు. వి వాంట్ జస్టిస్ అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ అంతరాయం కలిగింది పోలీసులు జోక్యం చేసుకొని.. నిరసన కారులనులో అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు.. కంసాల శ్రీనివాస్ నక్క ప్రమోద్ గోస్కి శంకర్ లు మీడియాతో మాట్లాడారు. నగరపాలక సంస్థ ఫుట్ బోర్డు పైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నామని వారి జయంతి వర్ధంతి లకు వేడుకలు కూడా నిర్వహించుకుంటున్నామని అన్నారు. అయితే అంబేద్కర్ అంటే పడని కొంతమంది దుర్మార్గులు హైకోర్టులో కేసు వేసి తొలగించుటకు ఆర్డర్ తీసుకొని రావడం... దానికి అధికారులు పోలీసులు ఒక కుట్రపూరితంగా అర్ధరాత్రి పూట ఎవరికి ముందు సమాచారం ఇవ్వకుండా దొంగతనంగా అవమానకరమైన పద్ధతిలో విగ్రహాన్ని జెసిబి తో తొలగించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఎవరో ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా ప్రభుత్వ అధికారులు విగ్రహాన్ని తొలగించడం చాలా బాధాకరమన్నారు.

## పంట పొలాలను సందర్శించిన
# వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



మొక్కజొన్న పరిశోధన స్థానం, హైదరాబాద్ మరియు తెలంగాణా రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం ఇల్లంతకుంట మండలం లోని గాలి పల్లె మరియు ముస్కాంపేట రైతుల పొలాలని సందర్శించడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మొక్కజొన్న పంట సాగులో రైతుల సమస్యలను తెలుసుకొని నివృత్తి చేయటం జరిగింది. ముఖ్యంగా కత్తెర పురుగు నివారణకు క్లోరాంత్రానిప్రోల్ 0.3 మి .లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. అదే విధంగా నత్రజని మరియు పొటాష్ ఎరువులని సిఫారసు మేరకు తప్పకుండా పూతదశలో కూడా వేసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా. సుశీల, డా. భద్రూ, డా. అనూష, డా. శ్రావణి.జిల్లా తెలంగాణా రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డా. హరికృష్ణ , ఏవో సురేష్ రెడ్డి,ఏఈఓ గంగ మరియు గ్రామ రైతులు పాల్గున్నారు.

# రూ.57 వేలు ఆర్థిక సాయం

**వేద న్యూస్,మెట్ పల్లి:**



మల్లపూర్ మండలం వి వి రావు పేట్ గ్రామానికి చెందిన కండేల గంగాధర్ అనే గల్ఫ్ కార్మికుని పట్ల కాలం కనికరం చూపలేదు. తన కుటుంబం కోసం చిన్నతనం లోనే అందరిని కాల్పోయి మళ్ళీ గల్ఫ్ వెళ్లి కుటుంబం కోసం కష్టపడి కుటుంబాన్ని సంతోషంగా సాకు తున్న సమయం లో విధి విషాదం లోకి నెట్టి%శీ%ది.కండెల గంగాధర్ తన భార్య అంజలి ఆరోగ్యం బాగా లేనందున ఎంతో ఖర్చు చేసుకొని హాస్పిటల్లో లక్షలు ఖర్చు చేసిన కూడా తన భార్యను క్యాన్సర్ నుండి రక్షించు కోలేకలేకపోయాడు. తోటి గల్ఫ్ కార్మికునిక గా చిన్నతనం నుండి చూసిన ఎంతోమంది గల్ఫ్ కార్మికులు చలించి పోయారు. వి వి రావుపేట్ గల్ఫ్ కార్మిక సంఘం సభ్యులు ఉడుతా సహాయంగా ఆర్థిక సాయం చేశారు. అక్షరాల యాభై ఏడు వేల రూపాయలు తోటి గల్ఫ్ కార్మికునికి ఇబ్బంది ఉందని చెప్పగానే వి వి రావుపేట్ గల్ఫ్ కార్మిక సంఘ సభ్యులు తన కుటుంబానికి ఆర్థికంగా చేశారు .

ఒకరికి ఒకరం భరోసానివ్వడం చాలా గొప్ప విషయం అని వి వి రావుపేట్ గల్ఫ్ సంఘ% నాయకులు తెలిపారు. అలాగే ఈ సంస్థ ఏర్పడిన నుండి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతో మంది గల్ఫ్ కార్మికలకు అవగాహనా కల్పిస్తు పలు కార్యక్రమాలు నాయకులకు ఎంతో సంతోషన్ని ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో వి వి రావుపేట గల్ఫ్ కార్మికుల సంఘం సభ్యులు పెనుకుల అశోక్, ఆరేల్లి మహేష్, విష్ణు రాజా,మచ్చర్ల అదిరెడ్డి, భి ఐ నారాయణ గౌడ్, రఘపతి, నలిమేల ప్రసాద్, పోతు రఘు, గుగ్లావత్ శ్రీకాంత్, మెండే ప్రవీణ్, రొడ్డ రాజశేఖర్, శ్రీమాన్ గౌడ్, రొడ్డ నవీన్, ఒల్లలా మల్లేషం, సంఘ మహేష్, గోపినేని రమేష్, వేల్పుల గంగాధర్, జక్కని నరేష్, కాట్కామ్ గణేష్, అరెల్లి శ్రీనివాస్, మిట్టపల్లి శ్రీనివాస్, సురేందర్ రొడ్డ, నాణెం రంజిత్, పళ్ళికొండ నరేష్, ఒల్లలా శ్రీనివాస్, పంజర్ల సత్యనారాయణ, %వీఎ% రహీమ్, కండెల వెంకటి, బాధనపెల్లి గంగారెడ్డి, ఇరిశెట్టి సాయిలు, కోమానా పెళ్ళి కాసాన్న, రొడ్డ రాజేందర్, కండెల భూమయ్య, వేల్పుల మహేష్, సకినాపెళ్ళి శేఖర్, కొడిమ్యాల లింగం చారి, సుతారి గణేష్, గుగ్లావత్ రాజేష్, యాళ్ల తిరుపతి రెడ్డి, అమర కొండ లక్ష్మి రాజాం, గుగ్లావత్ శ్యామల్, గుగ్లావత్ తిరుపతి, కండెల సాయిలు, లౌద్య విష్ణు, అరే రాజేశం, నిమ్మల విజయ్, ఎండీ ఆమాన్, వెల్మలా ప్రవీణ్, ఎండీ అబిబి, అరెల్లి రాజేశం, సకినపెల్లి రమేష్, జోగుల రాకేష్, గుగ్లావత్ చిన్నా,ఈ కార్యక్రమంలో పెనుకుల నరేష్, వేముల నరేష్, నలిమేల రాజు, సతీష్, శ్రీను,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన ఎస్ఐ


**వేద న్యూస్, సిరిసిల్ల:**



సిరిసిల్ల పట్టణానికి చెందిన ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్, ఆపదలో ఉన్న బాధితులకు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు.అత్యవసరంగా రక్తం అవసరమని సమాచారం అందగానే ఆయన వెంటనే ముందుకు వచ్చి రక్తదానం చేశారు.అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే రక్తదానం ఎంత ముఖ్యమో సొంత చర్యల ద్వారా చూపిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా ఆయన వ్యవహరించారు.స్థానికులు ఎస్ఐ దిలీప్ సేవా మనసుకు కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి ఆదర్శంగా నిలిచారని అభిప్రాయపడ్డారు.

# ఆర్టీసీ బస్సు, కారు ఢీ

**వేద న్యూస్,గంభీరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ సమీపంలో ఆర్టీసీ బస్సు, కారు ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. స్వల్పంగా వాహనాలకు మాత్రమే నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రయాణికులు, స్థానికులు ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

# విద్యార్థులకు ఏఐ టూల్స్ పై శిక్షణ ఇవ్వాలి

**వేద న్యూస్, వేములవాడ:**



విద్యార్థులకు ప్రస్తుత ఆధునిక ఏఐ టూల్స్ పై శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని వంటగది, స్టోర్ రూము, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతి రోజు అందిస్తున్న భోజన, స్నాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు చుట్టూ అపరిశుభ్రత, రహదారి, విద్యాలయం భవనానికి ప్రహరీ లేనట్లు గమనించారు. విద్యాలయం ఆవరణను శుభ్రంగా చేయాలని వేములవాడ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్డు, ప్రహరీ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పాఠాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని పాఠశాలలోని 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు మ్యాథ్స్, సోషల్, సైన్స్ ఎకనామిక్స్ కంప్యూటర్స్ పాఠాలను బోధించారు. ఇంటర్ విద్యార్థులకు కంప్యూటర్స్ ను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. విద్యార్థులను ఉదయం బ్రేక్ ఫాస్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి వచ్చే ముందు పాఠాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని వచ్చి విద్యార్థులకు సరిగ్గా విద్యాబోధన చేయాలని ఆదేశించారు.

# ఫార్మసీలో మాలతి కి డాక్టరేట్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ పరిశోధకురాలు మాలతి పి.ఎస్. కు విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ డాక్టరేట్ ను ప్రకటించారు. డాక్టర్ మాలతి పి.ఎస్. "ఫార్మకోకైనటిక్ అండ్ ఫార్మకోడైనమిక్ ఇంటరాక్షన్ స్టడీస్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ విత్ సమ్ పైటోకెమికల్స్" అనే అంశంపై ఫార్మసీ విభాగాచార్యులు ఆచార్య వై. నరసింహ రెడ్డి పర్యవేక్షణలో పూర్తి చేసారు. హనంకొండకు చెందిన డాక్టర్ మాలతీ పి.ఎస్. ప్రస్తుతం హనంకొండ లోని శ్రీ శివాని కాలేజీ అఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. మాలతిని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# గల్ఫ్ కార్మికుడి కష్టార్జితం సౌదీ బ్యాంకులో బందీ

**వేద న్యూస్, ముస్తాబాద్:**


రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి చెందిన రాగం రాజమల్లు సౌదీ అరేబియా దేశం అభా పట్టణ సమీపంలోని అల్-హరాజా మున్సిపాలిటీలో 2014 నుంచి 2025 వరకు 10 సంవత్సరాల పాటు క్లీనర్ గా పనిచేశాడు. రాజమల్లు పనిచేసిన పదేళ్ల కాలానికి సంబంధించిన ఎండ్ ఆఫ్ సర్వీస్ బెనిఫిట్స్ (ఉద్యోగ విరమణ ప్రయోజనాలు) 21,500 సౌదీ రియాళ్ళు (సుమారు రూ.5 లక్షలు) సొమ్మును యాజమాన్యం సౌదీ లోని అతని బ్యాంకు ఖాతాలో జమ చేసింది. డబ్బు ను అకౌంట్ నుంచి తీసుకునే లోగానే అతన్ని ఫిబ్రవరి 12న ఇండియాకు పంపించేశారు. సౌదీ నేషనల్ బ్యాంక్' లోని తన ఖాతాలో ఉన్న సొమ్మును ఇండియాలోని తన బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించాలని లేదా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ద్వారా అందించాలని కోరుతూ రాజమల్లు హైదరాబాద్, బేగంపేట ప్రజాభవన్‌లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'లో మంగళవారం (09.09.2025) ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, గల్ఫ్ జెఏసి నాయకుడు తోట ధర్మేందర్ లు అతనికి అండగా నిలిచారు.ఈ డబ్బును సౌదీ బ్యాంక్ నుంచి భారత్ కు బదిలీ చేయించడానికి, తమ కంపెనీ పబ్లిక్




రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో), పాకిస్థాన్ జాతీయుడైన మహమ్మద్ బిలాల్ కు 'పవర్ ఆఫ్ అటార్నీ' ఇచ్చానని రాజమల్లు తెలిపారు. తన సమస్యను జిద్దా లోని ఇండియన్ కాన్సులేట్.భారత దౌత్య కార్యాలయం.దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు.

# వైద్య శిబిరానికి స్పందన

**వేద న్యూస్, చొప్పదండి/రామడుగు:**



లయన్స్ క్లబ్ కరీంనగర్ వారు గురువారం మండల కేంద్రంలో వివేకానంద వాకర్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ను ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి మంచి స్పందన రాగా ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్యులు ఆపరేషన్ కు సిఫార్సు చేశారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐత్రవెని శ్రీనివాస్ తెలిపారు.

# పంట పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తల బృందం

**వేద న్యూస్, శాయంపేట :**

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్ శాస్త్రవేత్తల బృందం శ్యాంపేట మండలంలోని మైలారం, జోగంపల్లి గ్రామాలో పత్తి, వరి,మొక్కజొన్న పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త , కోఆర్డినేటర్ డా ఏ విజయ భాస్కర్ మాట్లాడుతూ పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వడలు తెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా. లీ నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారి చేసుకోవాలనీ సూచించారు. కాయ కుళ్ళు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రా, 1 గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ పది లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలనీ సూచించారు.పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి ఆరు నుండి ఎనిమిది లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అలాగే రసం పీల్చేచే పురుగుల నివారణకై వేప నూనె (1500 %ప్రావీ%) ఎకరాకు లీటర్ మందు చొప్పున లేదా అసిఫేట్ ఎకరాకు 300 గ్రాములు చొప్పున లేదా ఫ్లనికామైడ్ 0.25 మీ. లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న లో కత్తెర పురుగులు , ఆకు మాడు తెగులు



గమనించారు. నివారణకు కత్తెర పురుగు నివారణకు ఎమమెక్టిన్ బెంజోయేట్ మందు ఎకరాకు 80 గ్రా చొప్పున మొవ్విలో పడే విధంగా పిచికారి చేసుకోవాలని అలాగే ఆకుమాడు తెగులు నివారణగా ప్రాపికోనజోల్ అనే మందును ఎకరాకి 200 ఎంఎల్ పిచికారి చేయాల్సిందిగా సూచించారు.వరి పంటలో కాండం తొలచు పురుగు , పాము పొడ తెగులు . కాండం తొలిచిపురుగు నివారణకు క్లోరాంట్రనిలిప్రోలు 0.3 మి లీ చొప్పున లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి అన్నారు .పాము పొడ తెగులు నివారణకు వాలిడా మైసిన్ 2 మి లీ చొప్పున లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.ఈ బృందంలో శాస్త్రవేత్తలు డా వెంకట రాజకుమార్, డా ఆర్. విశ్వతేజ, ఎ ఓ గంగా జమున, జీ.అన్వేష్ (ఏ ఇ ఓ) , పలువురు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# చెక్కుల పంపిణీ

**వేద న్యూస్, ప్రతినిధి మెట్ పల్లి:**



మెట్టుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో గురువారం కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఇబ్రహీంపట్నం మండలం వివిధ గ్రామలకు మంజూరైనా సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిని చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 3,70,000వేల రూపాయల విలువ గల చెక్కులను పంపిణి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పడి వరకు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. హాస్పత్రిలో ఖర్చులపాలైన పేద ప్రజలకు సియం ఆర్ ఆఫ్ చెక్కులు కొంత మేరకు ఆర్థికంగా అండగా నిలుస్తుంది అన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలకు ఆకార్షితులై అమందు రాజేందర్ బీర్ ఎస్ పార్టీని విడిచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ కండువా కాప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమలో ఇబ్రహీంపట్నం మండల ప్రెసిడెంట్ గూడ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మండల ఎస్ సి సెల్ దూదిగామ గంగారాం, ఇబ్రహీంపట్నం మార్కెట్ చైర్మన్ బోర్గం రాజు, వర్షకొండ మాజీ ఎంపీటీసీ పొనకంటి వెంకట్, దొంతుల శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శుక్రవారం సెప్టెంబర్ 12, 2025

# కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి ఆశయాలు వర్ధిల్లాలి

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



తెలంగాణ సాయిధ రైతాంగ పోరాట వారోత్సవాలు 11నుండి 17 వరకు నిర్వహించటం జరుగుతుంది. దానిలో భాగంగా 30 బండ్లతో ర్యాలీ మండల కేంద్రం నుండి గాలిపెల్లి గ్రామం వరకు ఎర్రజెండాలు, నినాదాలతో గాలిపెల్లి ముద్దుబిడ్డ మాజీ పార్లమెంట్, శాసన సభ్యులు కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి స్థూపాలకు పూలమాలలు వేసి ఆయన విగ్రహ అవరణలో సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంద అనిల్ కుమార్ మంద అనిల్ కుమార్ సభ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, మాతృ భాష కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి, మట్టి మనుషులు చేసిన తిరుబాటు ధిక్కార స్వరం. "బాంచన్ దొర కాల్మొక్త" అన్న వెట్టి మనిషి "దొర ఏందిరో నీ దొరతనం ఏందిరో" అంటూ బందూకులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది అన్నారు. హైదరాబాద్ సంస్థాన రాజు ముస్లిం అయినప్పటికీ జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములు దాదాపు 90 శాతం హిందువులే. నిజాం నవాబుకు గులాములుగా వ్యవహరించడమే గాక నిజాంను మించిన దౌర్జన్యాలతో అనేక మందిని ఊచకోత కోయడం, మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగింపులు చేయడం, బతుకమ్మలు ఆడిరచడం, మానభంగాలు చేయడం లాంటి క్రూరమైన నేరాలను చేసిన జమీందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లలో హిందువులు ఉన్నారన్నారు. ముస్లిములు ఉన్నారు. అదే విధంగా నిజాం రాజు ముస్లిం అయినప్పటికీ పేద ముస్లిముల జీవితాలలో ఎటువంటి మార్పులేదు. తెలంగాణలో భూస్వామ్య ముస్లింలు కేవలం 2000 కుటుంబాలే కాగా పేద ముస్లింలు లక్షలాది మంది ఉన్నారు. అందులో 20 లక్షల మంది హైదరాబాద్ నగరంలో కడుపేదరికంలో ఉండేవారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటాల గాధలు స్ఫురించేలా అసువులు బాసిన వీరుల, కమ్యూనిస్టుయోధుల త్యాగాలను భావి తరాలు అందిపుచ్చుకునేలా ధైర్యంగా, అధికారికంగా విలీన దినోత్సవాన్ని జరపాలి. (తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధులను అప్పటి కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత కమ్యూనిస్టు పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శిగా ఉన్న నలమల్ల గిరిప్రసాద్ ఆధ్వర్యంలో స్ట్రీరింగ్ కమిటీ ఏర్పాటు చేసి వేలాది మందికి పెన్షన్ సౌకర్యం కల్పించిన విషయాన్ని గుర్తుచేస్తున్నాను.) తెలంగాణ పోరాట చరిత్రను రాష్ట్ర పాఠ్యాంశాలలో, అలాగే చిత్తశుద్ధి ఉంటే బిజెపి కూడా కేంద్ర పాఠ్యాంశాలలోను చేర్చాలని తెలిపారు. సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన త్రిమూర్తులు రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూంమోహినుద్దీన్‌ల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఒకే చోట ఏర్పాటు చేయాలి. దొడ్డి కొమరయ్య, షేక్ బంధగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి వీరుల విగ్రహాలను ముఖ్య కూడలిలో ఏర్పాటు చేయాలి. అలాగే మండల కేంద్రంలో బద్దం ఎల్లరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, కార్యవర్గ సభ్యులు గుంటి వేణు, కేవీ అనుసూర్య, కడారీ రాములు, మీసం లక్ష్మణ్, మంద అనిల్ ,మండల కార్యదర్శి తిపిరెడ్డి తిరుపతి రెడ్డి మరియు జిల్లా నాయకులు సావనపల్లి మల్లేశం,భూమిరెడ్డి, పెండల అధిత్య, బండారి చందు రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# 'ఖేల్‌కూద్'లో సత్తా చాటిన ఆవాస విద్యార్థులు

## - స్టూడెంట్స్‌కు పాఠశాల సమితి అధ్యక్షుడు, ఆచార్యుల అభినందన




**వేద న్యూస్, జమ్మికుంట:**

విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్‌కు అనుబంధంగా నడుస్తున్న సరస్వతి విద్యాపీఠం తెలంగాణ నిర్వహిస్తున్న ఖేల్‌కూద్ పోటీలలో భాగంగా ఆదిలాబాద్ శిశు మందిర్ పాఠశాలలో ఈ నెల 10,11,12 తేదీల్లో ప్రాంత స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం కేశవపురం జమ్మికుంట నుంచి 18 మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీలలో విద్యార్థులు వివిధ ఈవెంట్స్‌లలో ప్రథమ-20 , ద్వితీయ-9, తృతీయ-10 బహుమతులు సాధించారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రార్థన సమయంలో పాఠశాల సమితి అధ్యక్షులు చెట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దొరస్వామి నాయక్, పాఠశాల ప్రధానాచార్యులు పొలసాని సుధాకర్‌రావు, ఆచార్యులు విద్యార్థులను అభినందించారు. ఈ నెల 5, 6 తేదీలలో జరిగిన దక్షిణ మధ్య క్షేత్ర-కర్ణాటక చెస్ గేమ్స్‌లోనూ పాల్గొని కాంస్య పతకాలు సాధించిన విద్యార్థులను కూడా ప్రశంసించారు.

# చేయూత పెన్షన్ల పై అవగాహన

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చేయూత పెన్షన్ల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పి.పి.టి. ద్వారా డైరెక్టర్ సెర్ప్ గోపాల్ అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ చేయూత పథకం కింద వృద్ధులకు, దివ్యాంగులకు, హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు, వితంతువులకు, నేతన్నలకు, గీత కార్మికులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, బీడి టేకేదార్లు, డయాలసిస్, ఫిలేరియా పెషెంట్లకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని అన్నారు. ప్రస్తుతం వృద్ధుల పింఛన్ తీసుకుంటున్న వారు మరణిస్తే వారి స్థానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ మంజూరు చేయడం, హెచ్.ఐ.వి, డయాలసిస్ పింఛన్ పోర్టల్ ఓపెన్ ఉందని అన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ సంబంధించి రెండు రిజిస్టర్లు మెయింటెన్ చేయాలని ఒక రిజిస్టర్ లో మంజూరు చేసిన ఫించన్ దారుల వివరాలు, మరో రిజిస్టర్ లో అర్హత ఉన్న లబ్ధిదారుల వివరాలు రాయాలని, ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. వృద్ధాప్య పెన్షన్ దారులు మరణిస్తే వెంటనే పెన్షన్ వారి జీవిత భాగస్వామికు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ జారీ వివరాల రిజిస్టర్ పక్కాగా మెయింటైన్ చేయాలని అన్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్ 6 నెలల లోపు మాత్రమే స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు జారీ చేయాలని, 6 నెలల తర్వాత రెవెన్యూ డివిజన్ అధికారికి మాత్రమే ఆ హక్కు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.చేయూత పింఛన్ దారులు మరణిస్తే వెంటనే చనిపోయినట్లు మార్కింగ్ చేయాలని అన్నారు.




పెన్షన్ తీసుకుంటున్న వారు శాశ్వతంగా వలస పోతే క్షుణ్ణంగా విచారించిన తర్వాత పెన్షన్ తీసి వేయాలని అన్నారు. ప్రజా భవన్ దగ్గర జరిగే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను వెంటనే ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి రిపోర్టు 3 నుంచి 4 రోజులలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అర్హులైన పేదలకు అందాలని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల నిరుపేద కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినట్లయితే ఒకేసారి 20 వేల రూపాయల సహాయం అందుతుందని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఆపద్బంధు, జె.బి.వై., ఏఏబివై పథకం లబ్ధిదారులకు ఈ స్కిమ్ వర్తించదని అన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేస్తుంది కాంగ్రెస్ నాయకులే..!

**వేద న్యూస్,శాయంపేట:**

శాయంపేట మండలం మైలారం గ్రామంలో చేపడుతున్న పెద్ద చెరువు కట్ట పనులు తాము అడ్డుకోలేదని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్, మాజీ ఎంపీటీసీ గడిపె విజయ విజయ్ కుమార్ స్పందించారు. పనులు నిలిపివేసినట్టు స్వయంగా కాంట్రాక్టరే ఒప్పుకున్నా, పనులు అడ్డుకోలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ హుస్సేన్ పల్లి నుంచి మైలారం వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులు నిలిచిపోయింది వాస్తవమని తెలిపారు. పనులు ఆగిపోయింది కండ్ల ముందు కనిపిస్తున్నా అవాస్తవాలు మాట్లాడడం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పనులు అడ్డుకోకపోతే రోడ్డు ఎందుకు ఆగిపోయిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. రోడ్డు పనులు ఇష్టారీతిని చేపడుతున్నా ప్రశ్నించొద్దా అని మండిపడ్డారు. రాజకీయాలు చేస్తున్నది ఎవరో ప్రజలకు ఇప్పటికే అర్థమైందని తెలిపారు. అధికారంలో ఉన్నామని మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతుంటే వారి సమస్యలను పట్టించుకోకుండా టీఆర్ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ దూదిపాల రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ అరిజెల సునీత సాంబరెడ్డి, మాజీ సర్పంచ్ మస్కె సదయ్య, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు మస్కె సుమన్, మస్కె భాస్కర్, ఒంటేరు శంకర్, గడిపె చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డా.బి. రమేష్ అధ్యక్షతన ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. కళాశాలలోని డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే పార్టీని ఏర్పాటుచేశారు. ఈ ఫ్రెషర్స్ డే వేడుకలకు ముఖ్య అతిధిగా కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామిక వేత్త బచ్చు భాస్కర్ విచ్చేశారు. ఈ సందర్భంగా బచ్చు భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో చదువుకొని, ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కళాశాలకు, గురువులకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకరావాలని చెప్పారు. కళాశాలలో ఉచిత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్త బచ్చు భాస్కర్ ను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఫ్రెషర్స్ డే పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు, ఆట పాటలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్.ఓదెలు కుమార్, స్టాఫ్ సెక్రెటరీ డా. గణేష్ , అకడమిక్ కో-ఆర్డినేటర్ డా. రాజేంద్రం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య

వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:

ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గోధూర్‌కు చెందిన బూరం దేవదాస్ (50) రెండు నెలల క్రితం గల్ఫ్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చారు. మళ్ళీ గల్ఫ్ వెళ్తానని భార్యతో చెప్పాడు. దీంతో పిల్లల వివాహానంతరం వెళ్లాలని భార్య నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. మనస్తాపానికి గురైన దేవదాస్ ఈ నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. చికిత్స నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకువెళ్ళారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ దేవదాస్ మృతి చెందినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. మృతుని భార్య బూరం రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# డాక్టర్ రాజేందర్‌కు న్యూరాలజీలో గోల్డ్ మెడల్

## - ప్రదానం చేసిన అమ్రిత విశ్వవిద్యా పీఠం

**వేద న్యూస్, జమ్మికుంట:**




జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంతాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ఏకైక అమృత న్యూరో హాస్పిటల్‌లో.. వైద్యుడిగా సేవలందించే డాక్టర్ రాజేందర్ కందికొండకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. గురువారం కోయంబత్తూర్ అమ్రిత విశ్వ విద్యాపీఠం వారు డీఎం న్యూరాలజీలో వైద్యుడు రాజేందర్‌కు బంగారు పతకం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు రాజేందర్‌కు అమృత న్యూరో ఆస్పత్రి సిబ్బంది, పట్టణవాసులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. బెస్ట్ అకడమిక్, రీసెర్చ్ అంకప్లిష్‌మెంట్‌లో భాగంగా 2025కి గాను డీఎం న్యూరాలజీలో రాజేందర్‌కు గోల్డ్ మెడల్ వచ్చింది. సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సెప్షనల్ పర్ఫార్మెన్స్‌ను కూడా అందజేశారు. భవిష్యత్తులో పేద, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలందరికీ వైద్యుడు రాజేందర్ వృత్తిలో నైపుణ్యమున్న చక్కటి డాక్టర్‌గా సేవలందించాలని పలువురు ఆకాంక్షించారు. పవిత్రమైన వైద్య వృత్తిలో మానవత్వానికి, సేవకు మారుపేరుగా ఆయన నిలువాలని, నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# జిల్లాలో యూరియా సప్లయి పెంచండి


**వేద న్యూస్, ఎల్కతుర్తి:**




హన్మకొండ జిల్లాలో రైతులు యూరియా ఎరువు కొరతతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, యూరియా సరఫరా పెంచాలని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు కోరారు. ఈ విషయమై వారు గురువారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించారు. అధికారి యూరియా సప్లయి విషయమై సానుకూలంగా స్పందించినట్టు వెల్లడించారు.

# నూతన జీపీ నిర్మాణానికి భూమిపూజ

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. జీపీ భవన ప్రతిపాదిత స్థలంలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట ఏఎంసీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073